క్లుప్తంగా

రేపు ఇంటర్వ్యూలు

వైవీయూ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో ఐసీఐసీఐ బ్యాంకు, క్యూ వెంచర్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీల్లో ఉద్యోగాల కోసం ఈనెల 7వ తేదీ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జి. రవీంద్రనాథ్, జేకేసీ కో-ఆర్డినేటర్ రేఖ తెలిపారు. వివరాలకు 9347256400, 9490560441 నెంబర్‌లలో సంప్రదించాలని కోరారు.

8న ధర్నా

కడప ఎడ్యుకేషన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాత పెన్షన్ పునరుద్ధరణ చేయకుండా గ్యారెంటీ పెన్షన్ స్కీమ్ ప్రవేశపెట్టడం ఉద్యోగులకు నష్టదాయకం అని ఆంధ్రప్రదేశ్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏపీ సీపీఎస్ ఈఏ) రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ వైఎస్సార్ వెంకటజనార్దన్ రెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొండారెడ్డి, ఖాదర్‌బాషా ఒక ప్రకటనలో తెలిపారు. జీపీఎస్‌లోని ఇబ్బందులు ప్రభుత్వానికి తెలియచేయడానికి ఈ నెల 8న కలెక్టరేట్ వద్ద తలపెట్టిన ప్రతిఘటన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

జీతాలను చెల్లించాలి

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలోని హైస్కూల్ ప్లస్ పీజీటీలకు వెంటనే జీతాలు చెల్లించాలని ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రామాంజనేయులు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం కడపలోని ఎస్టీఎఫ్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా నాయకులు సాగర్, చంద్రశేఖర్, రవిశంకర్, సలాం, శ్రీరాములు, దిలీప్ చక్రవర్తి, అయవార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏఎఫ్‌యూ అధ్యాపకుడికి ఉత్తమ ప్రదర్శన అవార్డు



ఫణీంద్రరెడ్డిని అభినందిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

ఏఎఫ్‌యూ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం భౌతికశాస్త్ర అధ్యాపకుడు జి. ఫణీంద్రరెడ్డికి ఉత్తమ మౌఖిత ప్రదర్శన అవార్డు అందుకున్నారు. ఇటీవల కర్నూలు నగరంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిజైన్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'భారతదేశంలో గ్రీన్ హైడ్రోజన్ కోసం సవాళ్లు-అవకాశాలు' అన్న అంశంపై నిర్వహించిన జాతీయ సదస్సుల్లో ఈయన పాల్గొని పత్ర సమర్పణ చేశారు. డా.ఫణీంద్రరెడ్డిని వీసీ ఆచార్య బి.ఆంజనేయప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

డీఈఓకు వినతి

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలోని ఎయిడెడ్ పాఠశాలలో జీఓ నెంబర్ 59 ప్రకారం చేపట్టబోయే రేషనలైజేషన్‌ను త్వరగా చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ గిల్డ్ టీచర్ జిల్లా అధ్యక్షుడు బాలశౌరిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయమై బుధవారం డీఈఓ రాఘవరెడ్డిని తమ కార్యాలయంలో కలిసి వినతిపత్రమిచ్చారు. రేషనలైజేషన్ చేయగా మిగులు సిబ్బందిని జిల్లావ్యాప్తంగా ఉన్న జిల్లా పరిషత్తు, మండల పరిషత్తు పాఠశాలల్లో సర్దుబాటు చేయాలన్నారు. ఏపీ గిల్డ్ టీచర్స్ రాష్ట్ర అదనపు అధ్యక్షుడు నరసారెడ్డి పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్ లీకేజీ



బళ్లారి రోడ్డులో పైపులైన్‌కు లీకేజీ ఏర్పడిన దృశ్యం

కడప కార్పొరేషన్ : కడప నగరంలోని బళ్లారి రోడ్డులో టూ టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా తాగునీటి పైపులైన్‌కు లీకేజీ ఏర్పడింది. దీనివల్ల తాగునీరు వృథాగా పోతున్నాయి. నీరు లీకేజీ కావడం వల్ల ఇక్కడ గుంతలాగా ఏర్పడింది. కార్పొరేషన్ అధికారులు స్పందించి లీకేజీని అరికట్టాలని వారు కోరుతున్నారు.

ఘనంగా ఆర్ఎస్‌యూ ఆవిర్భావ దినోత్సవం

కడప ఎడ్యుకేషన్ : రెవల్యూషనరీ విద్యార్థి సంఘం 9వ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం కడపలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఆర్ఎస్‌యూ ఏర్పడిందన్నారు. హరి, ప్రమోద్, మదన్‌కుమార్, చక్రపాణి, రాజు పాల్గొన్నారు.

బీజేపీకి ఆరీఫుల్లా రాజీనామా!

కడప కోటిరెడ్డిసర్కిల్: భారతీయ జనతా పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు మాజీ డిప్యూటీ మేయర్ బి.ఆరీఫుల్లా తెలిపారు. ఈ మేరకు రాజీనామా పత్రాన్ని ఆ పార్టీ అధ్యక్షురాలు పురంధేశ్వరికి పంపినట్లు చెప్పారు. తన అనుచరులు, శ్రేయోభిలాషులు, స్నేహితులతోకలిసి త్వరలో సమావేశాన్ని ఏర్పాటు చేసి వారి సలహాలు, సూచనల మేరకు భవిష్యత్తు కార్యచరణ ఉంటుందని తెలిపారు. ఖురేషీ సంక్షేమసంఘాన్ని బలోపేతం చేస్తామన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ ఫలాలు

'జగనన్న సురక్ష' కార్యక్రమంలో
ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా



30వ డివిజన్‌లో ప్రజలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు

కడప కార్పొరేషన్ : అర్హతే ప్రామాణికంగా అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రజలకు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సీఎం అంజద్‌బాషా అన్నారు. బుధవారం స్థానిక 30, 43, 5 డివిజన్లలో నిర్వహించిన 'జగనన్న సురక్ష' శిబిరాల్లో ఆయన మేయర్ సురేష్ బాబుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్వీస్ రిక్వెస్ట్ స్పాట్ రిజిస్ట్రేషన్, దరఖాస్తుల పరిశీలన కౌంటర్లను పరిశీలించి, శిబిరానికి హాజరైన ప్రజలను పలకరించి ప్రభుత్వ సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం డిప్యూటీ సీఎం మాట్లాడుతూ రాష్ట్రంలో అర్హత ఉన్న ఏ ఒక్కరి నోటా ప్రభుత్వ పథకాలు అందలేదన్న మాట రాకూడదన్నారు. 'జగనన్న సురక్ష' కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సేవలు, పథకాలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వారం రోజులుగా జిల్లాలోని అన్ని సచివాలయాల పరిధిలోని వలంటీర్లు, ఇంటింటి సర్వే చేసి ప్రజలకు అవసరమైన సేవలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించారన్నారు. వాటిని సచివాలయాల వారీగా జగనన్న సురక్ష శిబిరాల్లో పరిష్కరిస్తున్నారన్నారు. ఇందు కోసం తహసీల్దార్, ఎంపీడీఓల ఆధ్వర్యంలో 8 ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయన్నారు. వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, జగనన్న అమ్మ ఒడి, విద్యాదీవెన పథకాలు 99 శాతానికి పైగా లబ్ధిదారులకు చేరువయ్యాయన్నారు. వివిధ కారణాల వల్ల పథకాలు అందకుండా మిగిలిపోయిన వారికి కూడా వాటిని అందించాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం అమలు చేస్తున్నామన్నారు. మేయర్ సురేష్ బాబు మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజల వద్దకే పరిపాలనను తీసుకెళ్లి ప్రభుత్వ పథకాలు, సేవలను అందించే లక్ష్యంతో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమం అమలు చేస్తోందన్నారు. ఈనెల 30వ తేది వరకూ ఈ కార్యక్రమం జరుగుతుందని, ఎవైనా సందేహాలుంటే 1902 నంబర్‌కు కాల్ చేసి 'జగనన్నకు చెబుదాం' ద్వారా తమ విజ్ఞప్తులను నమోదు చేసుకోవచ్చన్నారు. అనంతరం 30వ డివిజన్‌లో అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించారు. అక్కడి చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఆ తర్వాత గర్భిణులకు శ్రీమంతం చేశారు.

43వ డివిజన్‌లోని రవీంద్రనగర్లో బుగ్గవంకపై రెండు బ్రిడ్జిలు మంజూరు చేయించినందుకు పార్టీ నాయకులు రెడ్డిప్రసాద్, స్థానిక ప్రజలు డిప్యూటీ సీఎంను ఘనంగా సన్మానించారు. డిప్యూటీ మేయర్లు ముంతాజ్‌బేగం, నిత్యానందరెడ్డి, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, ఎన్నికల విభాగం అధికారి శివారెడ్డి, కార్పొరేటర్లు షఫీ, బండి జయమ్మ, మాజీ కార్పొరేటర్ బండిప్రసాద్, మార్కెట్ యార్డు వైస్ చైర్మెన్ మియ్యా, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్. సుబ్బారెడ్డి, తోటక్రిష్ణ, దేవిరెడ్డి ఆదిత్య, మదన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

బీడీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లాలోని బీడీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆలిండియా బీడీ వర్కర్స్ ఫెడరేషన్ నగర గౌరవాధ్యక్షుడు చంద్రారెడ్డి పేర్కొన్నారు. బుధవారం నగరంలోని సాయిపేటలో బీడీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీడీ రంగంలో పని చేస్తున్న కార్మికులు తక్కువ వేతనాలతో బీడీలను చుడుతూ యజమానులకు ఎక్కువ లాభాలను సంపాదించి పెడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఎక్కువగా బీడీ కార్మికులు రాయలసీమ జిల్లాలోనే ఉన్నారని తెలిపారు. వీరిలో దాదాపు 30 వేల మంది మైనార్టీలు, దళిత మహిళలలే ఉన్నారని వాపోయారు. రోజురోజుకు నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో బీడీ కార్మికులకు కూడ వేతనాలను పెంచాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై ఈ నెల 13న జరిగే రాష్ట్ర సమన్వయ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా బీడీ వర్కర్స్ ఫెడరేషన్ నాయకురాళ్లు జరీనా గౌసియా, హసీనా పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయుల జీతాల సమస్యను పరిష్కరించాలి



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

కడప ఎడ్యుకేషన్ : ఇటీవల జరిగిన బదిలీలో వివిధ పాఠశాలలకు బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించకపోవడాన్ని తీవ్రంగా నిరసిస్తున్నట్లు యూటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు శ్రీనివాసులు తెలిపారు. బుధవారం కడప యూటీఎఫ్ కార్యాలయంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం హడావిడిగా తీసుకునే నిర్ణయాల వల్ల అటు విద్యా రంగానికి ఇటు ఉపాధ్యాయులకు తీవ్రనష్టం చేకూరుతోందని అన్నారు. విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ పర్యటనలో పేరుతో ఉపాధ్యాయులను భయాందోళనకు గురి చేస్తున్నారని అన్నారు. సమస్యలుంటే పరిష్కరించాలే తప్ప అలా చేయడం సబబుకాదన్నారు. రాష్ట్ర కార్యదర్శులు నవకోటేశ్వరావు, లక్ష్మిరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయ్‌కుమార్, మహేష్‌బాబు, జిల్లా సహాధ్యక్షులు రవికుమార్, నాయకులు కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'మల్లెమాల'కు పలువురి నివాళి

కడప కల్చరల్ : ప్రముఖ వైద్యులు, కథకులు మల్లెమాల వేణగోపాల్‌రెడ్డి భౌతిక కాయాన్ని బుధవారం స్థానిక స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సందర్శించి నివాళులర్పించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి, గౌరీశంకర్, కొండారెడ్డి, ఇంటాక్ జిల్లా చాప్టర్ కన్వీనర్ కె.చిన్నపరెడ్డి, కో కన్వీనర్ పీవీ సుబ్బారెడ్డి, కార్యాలయ ఇన్‌ఛార్జి రాఘవేంద్రవర్మ, పుట్టా వెంకటసుబ్బయ్య తదితరులు డాక్టర్ మల్లెమాల భౌతిక కాయం వద్ద పూలమాల సమర్పించి నివాళులర్పించారు. లయన్స్ క్లబ్‌ఛార్టెడ్ ప్రెసిడెంట్‌గా మల్లెమాల అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు.

సమృద్ధిగా తాగునీరందించేలా ప్రణాళికలు



లింగంపల్లి వాటర్ వర్క్స్ వద్ద బోరు బావులను పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్

కడప కార్పొరేషన్ : కడప నగర ప్రజలకు సమృద్ధిగా నీరందించేందుకు తగిన ప్రణాళికలు రూపొందించాలని మున్సిపల్ కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. బుధవారం ఆయన లింగంపల్లి, బండి కనుమ పంప్ హౌస్‌లను పరిశీలించారు. లింగంపల్లి వద్ద నూతనంగా ఏర్పాటు చేస్తున్న బావులను పరిశీలించారు. మోటార్ల పనితీరు, వాటి పంపింగ్ సామర్థ్యాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. బావులపై జీఐ షీట్స్ ఏర్పాటు చేయాలన్నారు. రామనపల్లె, గండిలో ఎస్‌టీపీ ఏర్పాటు చేసేందుకు తగిన చర్యలు చేపట్టాలన్నారు. బండి కనుమ పంప్‌హౌస్ సిబ్బంది, ఫిట్టర్లతో మాట్లాడుతూ ఆర్‌సీ టెస్ట్ రిపోర్టు ప్రతిరోజూ ఇవ్వాలని సూచించారు. నీటి సరఫరాలో ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరించాలన్నారు. బండి కనుమ నుంచి మాసాపేట వరకూ ఉన్న పైపులైన్‌లో ఏర్పడిన సమస్యలను పరిష్కరించాలన్నారు. ఎస్ఈ రత్నాల రాజు, పబ్లిక్ హెల్త్ ఈఈ చెన్నకేశవరెడ్డి, ఏఈ మణిగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పిల్లలు, గర్భిణీలకు పౌష్టికాహారం అందించాలి

అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలని కమిషనర్ ఆదేశించారు. బుధవారం చౌటపల్లె, సున్నపురాళ్లపల్లె అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన పరిశీలించారు. పిల్లలకు ప్రతిరోజూ గుడ్లను అందించాలని, గర్భిణీలు, పిల్లల ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పిల్లల హాజరు పట్టికలను సక్రమంగా నిర్వహించాలన్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం చేయాలి



కడప రిమ్స్ ఓపి ముందు నిరసన చేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం నాయకులు, ఉద్యోగులు

కడప అర్బన్ : కాంట్రాక్ట్ ఉద్యోగుల తరహాలోనే ఔట్ సోర్సింగ్ (ఆప్కాస్) ఉద్యోగులను పర్మినెంట్ చేసి న్యాయం చేయాలని ఏపీ మెడికల్ అండ్ హెల్త్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం మూడవరోజున కడప రిమ్స్ ఓపీ విభాగం ముందు గంటసేపు నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి. వెంకట సుబ్బయ్య, పీవి సుదర్శన్ మాట్లాడుతూ పర్మినెంట్ అయ్యేంతవరకు ఆప్కాస్ ఉద్యోగులకు సమానపనికి, సమాన వేతనం అమలు చేయాలనీ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ ఉపాధ్యక్షులు ఎల్. భాస్కర్, బి. బాలాజీరావు, ఏసన్న, రామకృష్ణ, చెన్నయ్య, కార్యదర్శులు కొండయ్య, సురేష్, రాజారత్నం, కమిటీ సభ్యులు జయరాం, సుబ్బారావు, ఏ లక్ష్మయ్య, బాదుల్లా, పి. పవన్, మరియమ్మ, జయసుధ, రిమ్స్ కార్మికులు పాల్గొన్నారు.

క్రీడా కోటా రద్దు నిర్ణయం సరికాదు

కడప వైఎస్ఆర్ సర్కిల్: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాల్లో క్రీడా కోటా రద్దు నిర్ణయాన్ని ఉపసహరించుకోవాలని డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి ఓబులేసు పేర్కొన్నారు. బుధవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగాల్లో క్రీడా కోటా రద్దు చేసి మెడలిస్టులకు ప్రోత్సాహకాలు, ఆర్థిక సాయంపై 2023-2028 క్రీడా పాలసీలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసహరించుకోవాలన్నారు. డీవైఎఫ్ఐ నాయకులు విజయ్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

స్టడీ సెంటర్ ఏర్పాటు

కడప కోటిరెడ్డిసర్కిల్ : విద్యార్థులు, నిరుద్యోగ యువత సౌకర్యార్థం కడప నగరంలో స్టడీ సెంటర్ ఏర్పాటు చేశామని నిర్వాహకులు అశోక్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏసీ గదులతోపాటు వైఫై, ఆర్వో నీటి సౌకర్యం, పవర్ బ్యాంకు సౌకర్యం అందుబాటులో ఉందన్నారు. అలాగే ఐబీపీఎస్, ఆర్ఆర్‌బీ, ఏపీపీఎస్సీ, టీఎస్ పీఎస్సీ, ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాలకు సంబంధించి మెటీరియల్ తమవద్ద అందుబాటులో ఉందని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 99630 95103నెంబరులో సంప్రదించాలని ఆయన సూచించారు.

రాజకీయాలు హుందాగా చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పులి సునీల్, డిప్యూటీ మేయర్

కడప కార్పొరేషన్ : రాజకీయాలు హుందాగా చేయడం అలవర్చుకోవాలని ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబులపై కొందరు కరపత్రాలు వేయడం దారుణమన్నారు. వారు అందులో చేసిన ఆరోపణలు, ఉపయోగించిన భాష అసభ్యంగా, నీచంగా ఉందన్నారు. దీన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బురదజల్లి రాక్షసానందం పొందేందుకే ఇలా చేశారని అనుమానం వ్యక్తం చేశారు. దీన్ని టీడీపీ నాయకులు సోషల్ మీడియాలో ట్రోల్ చేయడం సిగ్గుచేటన్నారు. దీన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరామన్నారు. దమ్ము, ధైర్యం ఉంటే, వారు చేసిన ఆరోపణలు నిజమైతే బహిరంగంగా చేయాలన్నారు. ఇలా దొంగచాటుగా చేయడం పిరికిపంద చర్య అన్నారు. ఇందుకు బాధ్యులైన వారిని తక్షణం అరెస్ట్ చేయాలని, దీనిని ప్రోత్సహిస్తున్నవారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. దీనివెనుక ఎవరున్నారో త్వరలోనే బయటికి వస్తుందని తెలిపారు. ఇలాంటి కుట్రల వల్ల ఓట్లు, సీట్లు వస్తాయనుకుంటే వారి భ్రమేనన్నారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్, సుబ్బరాయుడు, హరిచందన్, రాజా పాల్గొన్నారు.

విద్యార్థులను విద్యావంతులుగా తీర్చిదిద్దాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కవిత

కడప రూరల్ : విద్యార్థులను విద్యావంతులుగా తీర్చిదిద్దాలని ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి, ఫుల్ అడిషనల్ ఛార్జి సెక్రటరీ ఎస్.కవిత తెలిపారు. బుధవారం స్థానిక కో-ఆపరేటివ్ కాలనీ లోగల ప్రభుత్వ కళాశాల బాలికల వసతి గృహంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వంట, వసతి గదులను పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కవిత మాట్లాడుతూ పిల్లలు సత్ప్రవర్తనతో విద్యను అభ్యసించాలన్నారు. పిల్లల విద్య, ఆరోగ్య విషయాల పట్ల అధికారులు తగు జాగ్రత్తలు తీసుకుని వారిని విద్యావంతులుగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ జ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ప్రపంచ జూనోసిస్ డే

కడప అగ్రికల్చర్: జూనోటిక్ వ్యాధుల ప్రమాదంపై అవగాహన పెంచడానికి ఏటా జులై 6న ప్రపంచ జూనోసెస్ డే నిర్వహిస్తున్నారని జిల్లా సంవర్ధకశాఖ అధికారి డాక్టర్ శారదమ్మ అన్నారు. ఇందులో భాగంగా కడప కోటిరెడ్డిపల్లె సర్కిల్ సమీపంలోని బహుళార్థ పశువైద్యశాల ఆవరణలో కుక్కలకు ఉచిత రేబిస్ వ్యాధి టీకాలను వేస్తామని వివరించారు. ప్రజలు తమ పెంపుడు జంతువులకు టీకాలు వేయించాలని ఆమె కోరారు.

'జగనన్న సురక్ష'తో దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్

కడప కార్పొరేషన్ : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్న సురక్ష' కార్యక్రమం ద్వారా ఎన్నో దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం లభిస్తోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ అన్నారు. బుధవారం మారుతీనగర్‌లోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 1 నుంచి 30వ తేది వరకూ నిర్వహించే ఈ కార్యక్రమంలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, అధికారులు ప్రజల ఇళ్ల వద్దకే వెళ్లి వారికి ఏం కావాలో తెలుసుకొని ఆ సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నారన్నారు. చాలామంది కొన్ని సాంకేతిక కారణాల వల్ల కొన్ని పథకాలకు అర్హులు కాకుండా పోతున్నారని, అలాంటి వారికి జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా మేలు జరుగుతోందన్నారు. ప్రభుత్వం అందించే 11 రకాల సేవలకు సంబంధించిన సర్టిఫికెట్లను పూర్తి ఉచితంగా అందించడం అభినందనీయమన్నారు. ఇందుకు ప్రజల పక్షాన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాఠశాలల బంద్ విజయవంతం



విద్యార్థులతో కలిసి ఆందోళన చేస్తున్న ఏబీవీపీ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : పాఠశాలల్లోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్తు రాష్ట్రశాఖ మేరకు బుధవారం కడప నగరంలో చేపట్టిన బంద్ విజయవంతం అయింది. ఈ సందర్భంగా ఏబీవీపీ జిల్లా కన్వీనర్ మంజూనాథ రెడ్డి మాట్లాడుతూ ప్రైవేటు, కార్పోరేట్ పాఠశాలల్లో జరుగుతున్న ఫీజుల దోపిడికి అడ్డుకట్ట చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను కల్పించి నాణ్యమైన విద్యను అందించాలన్నారు. ఉపాధ్యాయ పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలన్నారు. అనుమతులు లేకుండా నడపుతున్న ప్రైవేటు పాఠశాలలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు నియంత్రణ కోసం జిల్లా కలెక్టర్ ఫీజు నియంత్రణ కమిటిని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు సంఘ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వినతి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లాలో అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సగిలి రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు.ఈ మేరకు బుధవారం డీఈవో రాఘవరెడ్డికి వినతిపత్రమిచ్చారు. ఫీజులు వివరాలను ఎక్కడ కూడ నోటీసు బోర్డులో పెట్టడం లేదని ఆరోపించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు సునీల్, సురేష్ పాల్గొన్నారు.

పాత కలెక్టరేట్‌ను పరిశీలించిన అధికారులు

కడప కల్చరల్ : పాత కలెక్టరేట్‌ను బుధవారం జిల్లా అధికారులు పరిశీలించారు. జిల్లా తలమానికంగా నిలిచిన అత్యంత ప్రాచీనమైన వారసత్వ సంపదగా భావిస్తున్న ఈ భవనానికి అవసరమైన మరమ్మతులు చేసి వినియోగంలోకి తెచ్చేందుకు కలెక్టర్ సూచన మేరకు అధికారులు సాంకేతిక బృందంతో పరిశీలించారు. కలెక్టర్ ఓఎస్‌డీ రఘునాథ్, పంచాయతీరాజ్‌శాఖ ఎస్ఈ శ్రీనివాసులురెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ రోనాల్డ్, గునిశెట్టి శ్రీనివాసులు ఇతర సిబ్బందితోకలిసి బుధవారం సాయంత్రం పాత కలెక్టరేట్ భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఈ శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ఈ భవనాన్ని పునరుద్ధరించేందుకు కలెక్టర్ శ్రద్ధ కనబరుస్తున్నారని, ఆయన ఆదేశాల మేరకు తాము ఇతర అధికారులతో కలిసి పాత కలెక్టరేట్ భవనాన్ని, అందులోని అన్ని విభాగాలు, భవనం అణువణువు పరిశీలించామన్నారు. నివేదికను కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు, తర్వాత ఆయన సూచనల మేరకు పనులు చేపడతామని వివరించారు. ఈ సందర్భంగా ఓఎస్‌డీ రఘునాథ్ తదితరులు పాత కలెక్టరేట్ భవనంలోని ఇంటాక్ కార్యాలయాన్ని సందర్శించారు. పలువురు ఇంటాక్ సభ్యులు పాల్గొన్నారు.

కడపకు తలమానికం...రాజీవ్ మార్గ్

ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా,
మేయర్ సురేష్ బాబు



పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు తదితరులు

కడప కార్పొరేషన్: నగర ప్రజలకు ఆటవిడుపు, ఆరోగ్యానికి ఆహ్లాదకర వాతావరణంలో సరికొత్త హంగులతో, ఆధునాతన వసతులతో రూపుదిద్దుకుంటున్న రాజీవ్ మార్గ్, రాజీవ్ పార్కులు కడప నగరానికే తలమానికంగా మారనున్నాయని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబులు అన్నారు. బుధవారం సాయంత్రం ముఖ్యమంత్రి ప్రారంభించనున్న రాజీవ్ మార్గ్, రాజీవ్ పార్కు పనులను వారు పరిశీలించారు. 10వ తేది నాటికి అన్ని పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ కడప నగర సుందరీకరణకు శ్రీకారం చుట్టింది దివంగత వైఎస్సారేనని తెలిపారు. అప్పట్లో ఆయన రాజీవ్ పార్కు, రాజీవ్ మార్గ్, నెహ్రూ పార్కులను ఏర్పాటు చేశారని, 18 ఏళ్ల తర్వాత వైఎస్సార్ తనయుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వాటిని మరింత అందంగా తీర్చిదిద్దుతున్నారన్నారు. రాజీవ్ పార్కు వద్ద ఫుడ్ జోన్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. 10వ తేది ముఖ్యమంత్రి కడపలో 1.50కోట్లతో నిర్మించిన రాజీవ్ పార్కును, రూ.10కోట్లతో నిర్మించిన రాజీవ్ మార్గ్‌ను ప్రారంభిస్తారన్నారు. అలాగే కడప నగరంలో మంచినీటి సమస్యను శాశ్వితంగా పరిష్కరించడానికి బ్రహ్మంసాగర్ నుంచి రూ.573కోట్లతో చేపట్టిన పైపులైన్ పనులకు, రూ.32కోట్లతో నిర్మించనున్న నగరపాలక సంస్థ భవనానికి, జగనన్న కాలనీల్లో రూ.69కోట్లతో డ్రైనేజీ కాలువ నిర్మాణానికి, రూ.15కోట్లతో పుట్లంపల్లె చెరువు అభివృద్ధికి, రూ.5కోట్లతో బుడ్డాయపల్లె చెరువు అభివృద్ధికి, రూ.20కోట్లతో బుగ్గవంకపై లా కాలేజీ వద్ద, షామీరియా మసీదు వద్ద రెండు బ్రిడ్జిల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా రూ.2000కోట్ల పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారని చెప్పారు. డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, 20వ డివిజన్ ఇన్‌చార్జి శ్రీరంజన్‌రెడ్డి, పార్టీ నాయకులు జయచంద్రారెడ్డి, షఫీ, అజ్మతుల్లా, రామ్మోహన్‌రెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

రూ.2.68కోట్ల అభివృద్ధి పనులకు ఆమోదం

స్టాండింగ్ కమిటీ సమావేశంలో తీర్మాణం



స్టాండింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ సురేష్‌బాబు

కడప కార్పొరేషన్: కడప నగరంలో రూ.2.68కోట్లతో నిర్మించతలపెట్టిన అభివృద్ధి పనులకు నగరపాలక స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. బుధవారం సాయంత్రం మేయర్ సురేష్ బాబు అధ్యక్షత నిర్వహించిన ఈ సమావేశంలో అన్నమయ్య సర్కిల్ నుంచి సంజన్న సర్కిల్ వరకూ రూ.38.50లక్షలతో, సంజన్న సర్కిల్ నుంచి వైఎస్సార్ సర్కిల్ వరకూ రూ.39లక్షలతో స్టోన్ క్లాడ్డింగ్ సెంట్రల్ మీడియన్ ఏర్పాటు చేయుటకు జనరల్ ఫండ్ వినియోగానికి అనుమతించారు. సెంట్రల్ జైలు సమీపంలోని హిందూ, క్రిస్టియన్, ముస్లిం శ్మశాన వాటికల్లో గుంతలు పూడ్చి, మట్టి తోలేందుకు రూ.31.51లక్షలు, ఇరుకుగా ఉన్న కడప-పులివెందుల రహదారిని 0/6 కి.మీ నుంచి 1/8 కి.మీ వరకూ విస్తరించేందుకు రూ.27.10లక్షలతో రూపొందించిన అంచనాలను ఆమోదించారు. నగరంలో విచ్చలవిడిగా తిరుతున్న గోవులను గోశాలకు తరలించి, వాటటి సంరక్షణ బాధ్యతలను నిర్వహించేందుకు ఒక కాంపౌండర్, ఐదుగురు గోశాల సిబ్బంది, 30 మంది మలేరియా విభాగపు డీసిల్టింగ్ పనులు చేసేవారిని రోజు కూలి చొప్పున ఏడాది కాలపరిమితితో నియమించేందుకు అంగీకరించారు. కడప నగరపాలక సంస్థ వెనుక ఉన్న మరుగుదొడ్లను సులభ్ ఇంటర్నేషనల్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ వారికి నెలకు లక్ష రూపాయల చొప్పున ఏడాది పాటు అప్పగించేందుకు ఆమోదం తెలిపారు. కడప నగరాభివృద్ధిలో భాగంగా ఈట్ స్ట్రీట్, స్పోర్ట్స్ ఆరేనాను భగత్ సింగ్ పార్కు ఎదురుగా ఉన్న స్థలంలో ఏర్పాటు చేయుటకు, షిఫ్ అండ్ మీట్ మార్కెట్ డిజైన్, రెవెన్యూ జనరేటింగ్ మోడల్ ఫర్ ఓల్డ్ బస్టాండ్, మల్టీలెవెలింగ్ పార్కింగ్ ఫెసిలిటీ, సోలార్ ప్రాజెక్టుల డీపీఆర్‌లు తయారు చేయుటకు కన్సల్టెంట్లను నియమించుకొని, వారి కమీషన్‌ను జనరల్ ఫండ్ నుంచి చెల్లించేందుకు తీర్మాణించారు. నగరంలోని 4 ఉన్నతపాఠశాలల్లో డిజిటల్ క్లాస్ రూముల నిర్వహణకు కావలసిన పరికరాలను కొనుగోలు చేయుటకు రూ.40.05లక్షలను జనరల్ ఫండ్ నుంచి చెల్లించేందుకు ఆమోదం తెలిపారు. కమిషనర్ ప్రవీణ్‌చంద్, స్టాండింగ్ కమిటీ సభ్యులు సుబ్బారెడ్డి, షఫీ, శిరీష, మేసా ప్రమీలారాణి, డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

10 నుంచి అంగన్వాడీల ధర్నా

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఈ నెల 10, 11 తేదీల్లో అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట 36 గంటల ధర్నా చేపడుతున్నట్లు సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ తెలిపారు. బుధవారం తమ కార్యాలయంలో ధర్నాకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీదేవి, నాయకులు లక్ష్మీదేవి, అంజలీదేవి, వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లాలోని అంగన్వాడీ కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా, నగర అధ్యక్ష, కార్యదర్శులు సుబ్బరాయుడు, మద్దిలేటి కోరారు. బుధవారం ఐసీడీఎస్ కార్యాలయంలో పీడీ శ్రీలక్ష్మికి ఈ మేరకు వినతిపత్రమిచ్చారు. ప్రొద్దుటూరు-1, 2 సెక్టార్స్ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలన్నింటినీ అర్బన్ ప్రాజెక్టులోకి విలీనం చేసిన తర్వాత వాటిని యథావిధిగా సెక్టార్ల వారీగా కొనసాగించాలన్నారు.